ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
ఆదివారం 16 మార్చి 2025 www.prajaaswaramdaily.com 2 pm

# ఏఆర్ రెహమాన్ డిశ్చార్జి

**డిహైడ్రేషన్, గ్యాస్ట్రిక్ సమస్యతో అస్వస్థత**

**ఆయన త్వరగా కోలుకోవాలంటూ అభిమానుల పోస్టులు**

చెన్నై: ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు.డిహైడ్రేషన్, గ్యాస్ట్రిక్ సమస్య కారణంగా ఆయన ఒకింత అస్వస్థతకు గురయ్యారు. ఈ మేరకు చికిత్స తీసుకున్నారు. డిహైడ్రేషన్‌తోనే ఆస్పత్రిలో చేరారని, చికిత్స తర్వాత డిశ్చార్చి చేసినట్లు అపోలో వైద్యులు తెలిపారు.ఈ ఉదయం వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఛాతీ నొప్పి కారణంగా ఆస్పత్రిలో చేరారని కథనాలు ప్రచురితమయ్యాయి. ఆయన వేగంగా కోలుకోవాలని కోరుకుంటూ ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. వర్క్ విషయానికి వస్తే.. ఆయన 'ఆర్‌సీ 16' కోసం వర్క్ చేస్తున్నారు. రామ్‌చరణ్, బుచ్చిబాబు కాంబినేషన్‌లో ఈ సినిమా రూపొందుతోంది. రెండు పాటలు కంపోజ్ చేసినట్లు ఇటీవల వెల్లడించారు.



# బడ్జెట్ సమావేశాల్లో కేసీఆర్ తప్పులన్నీ బయటపెడతా



**మా నెత్తిన రూ.8.29 లక్షల అప్పు ఆయన ఘనతే**

**ఏడాదిలోనే రూ.84వేల కోట్లు వడ్డీ...**

**అసలు రూ.64 వేల కోట్లు చెల్లించాం**

**మా ప్రభుత్వం వచ్చాకే వరంగల్‌కు ఎయిర్‌పోర్టు, రింగురోడ్డు**

**కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ**

**సీఎం రేవంత్ రెడ్డి**

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణను పట్టిపీడించినోడు జాతిపిత ఎలా అవుతాడు. 15 నెలలు అసెంబ్లీకి రాకుండా రూ.58 లక్షల జీతం తీసుకున్నాడు. మా అప్పులు ఎట్లా పెరిగాయి.. మీకు లక్ష కోట్ల ఆస్తులు ఎలా పెరిగాయి.? లక్ష కోట్లు సంపాదించే నైపుణ్యం ఏంటో మా యువతకు నేర్పమని అడుగుతున్నా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. స్టేషన్ ఘన్ పూర్ లో ప్రజా పాలన ప్రగతి బాట విజయోత్సవ సభకు హాజరై ఆయన ప్రసంగించారు. రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మహిళా శక్తి పథకం ద్వారా లబ్ధిదారులకు. 7 ఆర్టీసీ బస్సులను అందించారు.

**మా ప్రభుత్వం వచ్చాకే వరంగల్‌కు ఎయిర్‌పోర్టు, రింగురోడ్డు**

ఉమ్మడి వరంగల్ అంటే తనకు ఎంతో అభిమానమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా వరంగల్ గడ్డ నుంచి ఎన్నో పోరాటాలు జరిగాయన్నారు. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు తీసుకొస్తానని లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మాటిచ్చా.. చెప్పినట్టుగానే ఎయిర్‌పోర్టును సాధించి మీ ముందు నిల్చున్నానని సీఎం అన్నారు. "కేసీఆర్ రూ.8.29లక్షల అప్పును మా నెత్తిమీద పెట్టి పోయారు. ఆయన చేసిన అప్పులకు ఒక్క ఏడాదిలోనే ఈ ప్రభుత్వం రూ.84వేల కోట్లు వడ్డీ, రూ.64 వేల కోట్లు అసలు చెల్లించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ప్రజలకు కూడా తెలియాల్సిన అవసరం ఉంది. ఎన్ని ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం.

అధికారంలోకి వచ్చిన 2 రోజులకే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాం. ఇందుకోసం ఇప్పటికే రూ.5,500 కోట్లు కేటాయించాం. ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకొని కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుబంధు కింద రూ.7,200 కోట్లు ఇచ్చాం. గ్రూప్ 1,2,3 పరీక్షలను సవ్యంగా నిర్వహించి ఉద్యోగాలు ఇస్తున్నాం. అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. తెలంగాణ రాష్ట్రానికి కడియం శ్రీహరి అవసరం ఉందని చెప్పి పార్టీలోకి తీసుకొచ్చాం. ఎమ్మెల్యేగా జీతభత్యాలు తీసుకుంటున్న వ్యక్తి తన బాధ్యతలను నెరవేర్చటం లేదు. 15 నెలలుగా జీతభత్యాలు తీసుకుంటూ అసెంబ్లీకి మాత్రం రావట్లేదు. ప్రజల సొమ్మును జీతంగా తీసుకునే వ్యక్తి ప్రజల కోసం అసెంబ్లీలో సూచనలు ఎందుకు చేయట్లేదు? తన అనుభవాన్ని ప్రజల కోసం ఎందుకు ఉపయోగించట్లేదు? ఈ ప్రభుత్వం వచ్చాకే వరంగల్‌కు ఎయిర్‌పోర్టు, రింగురోడ్డు వచ్చాయి. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వచ్చింది. జయశంకర్ సర్ స్వగ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా చేసింది మా ప్రభుత్వమే. బడ్జెట్ సమావేశాల్లో కేసీఆర్ చేసిన తప్పులన్నీ బయటపెడతా"అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు



# నైట్ క్లబ్ లో భారీ అగ్ని ప్రమాదం

**50 మందికి పైగా మృతి**

**100మందికి పైగా గాయాలు**

ప్రపంచం : యూరప్‌లోని నార్త్ మెసిడోనియాలో నైట్ క్లబ్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 50 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. మరో 100మందికిపైగా గాయపడినట్లు అంతర్గత మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గంటలు గడిచినా మంటలు అదుపులోకి రాలేదని సమాచారం. ఈ కార్యక్రమానికి సుమారు 1500 మంది హాజరయ్యారు. అయితే ఆదివారం తెల్లవారుజామున అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ఈవెంట్‌లో మండే స్వభావం కలిగిన వస్తువులు వాడటంతోనే సీలింగ్‌కు నిప్పు అంటుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

# ఆస్పత్రి బెడ్ పై సమంత

సినిమా : ఆసుపత్రి బెడ్ పై సమంత పడుకుని ఉండగా ఆమె చేతికి సెలైన్ ఎక్కిస్తున్నారు. దీంతో సమంతకు మళ్లీ ఏమైంది, ఆమె అరోగ్యం ఇప్పుడు ఎలా ఉందని అభిమానులు కంగారు పడుతున్నారు. సమంత కొంతకాలంగా మయోసైటిస్ తో బాధపడుతున్న విషయం తెలిసిందే.

తాజాగా సమంత ఆసుపత్రిలో ఉన్న ఫొటోలను ఆమె స్వయంగా ఇన్ స్టాలో పోస్ట్ చేసింది. దీంతో ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.



# వ్యాయామంతోనే మంచి ఆరోగ్యం

**మంత్రి జూపల్లి కృష్ణారావు**




హైదరాబాద్ : నిత్య వ్యాయామంతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్ కూకట్ పల్లి ఆల్విన్ కాలనీ తులసి వనం వద్ద అవని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు కిలోమీటర్ల పరుగు కార్యక్రమాన్ని టూరిజం శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి తో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. జీవితంలో ఏ పని చేయాలన్న ఆరోగ్యం ప్రధానమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం నిత్యం వ్యాయామం చేయాలన్నారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలు తరచూ చేపడుతుండాలని సూచించారు . స్వచ్ఛంద కార్యక్రమాలు చేపడుతున్న సంస్థలకు తోడ్పాటును అందించాలని తెలిపారు.

# కేంద్రం.. హిందీని బలవంతంగా రుద్దలేదు

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



హైదరాబాద్ : ప్రధాని మోదీ ప్రభుత్వం ఏ ఒక్క రాష్ట్రం లేదా వ్యక్తిపైనా హిందీని రుద్దలేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. మోదీ వచ్చాకే ప్రాంతీయ భాషల్లో ఉన్నత విద్య దిశగా అడుగులు పడ్డాయని వెల్లడించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసమే తమిళనాడులో డీఎంకే సర్కార్ రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. తీవ్రమైన అవినీతి, మోయలేని పన్నుల భారం, మద్యం కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే నాటకాలాడుతున్నారని ఆరోపించారు. అఖిలపక్ష సమావేశం సైతం రాజకీయ ఎత్తుగడేనని తెలిపారు. త్రిభాషా సిద్ధాంతం తమ హయాంలో వచ్చింది కాదన్న కిషన్ రెడ్డి... సీ రాజగోపాల చారి ఆలోచన నుంచే వచ్చిందన్నారు. కాంగ్రెస్ హయాంలో కొఠారి కమిషన్ సైతం త్రిభాషా సిద్ధాంతాన్ని బలపరిచిందని స్పష్టం చేశారు.

# మలాపూర్ అడవుల్లో పులి సంచారం

**అధికారుల వాల్ పోస్టర్ రిలీజ్**



జయశంకర్ భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పులి సంచారం కలకలం రేపుతుంది. మలాపూర్ అడవుల్లో పులి తిరుగుతున్నట్లు వాల్ పోస్టర్ ను అటవీ శాఖ అధికారులు విడుదల చేశారు. భూపాలపల్లి అటవీ రేంజ్ పరిధిలోని కమలాపూర్, రాంపూర్, మేడిపల్లి, కొత్తపల్లి అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు తెలిపారు. రేంజ్ అధికారి బసవ నరేష్ పర్యవేక్షణలో అటవీ సిబ్బంది పులి పాదముద్రలను గుర్తించారు. నాలుగు ప్రాంతాల్లో పులి సంచరించినట్లు నిర్ధారించారు. గత నెలలో పెద్దపల్లి జిల్లా నుంచి భూపాలపల్లి జిల్లాలోకి మగ పులి ప్రవేశించి కాటారం అడవుల్లో మూడు రోజుల క్రితంఒ ఆవును చంపినట్లు తెలిపారు. రాత్రి సమయంలో రైతులు పొలాల వద్దకు వెళ్లకూడదని పులి ఆనవాళ్లు కనిపిస్తే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# సినీ నటుడు విష్వక్సేన్ ఇంట్లో చోరీ

**రూ.2లక్షల విలువైన బంగారు ఆభరణాలు తస్కరణ**

హైదరాబాద్: హైదరాబాద్ ఫిల్మ్ నగర్ లో సినీ నటుడు విష్వక్సేన్ ఇంట్లో చోరీ జరిగింది. తన సోదరి గదిలోని వస్తువులు చిందరవందరగా ఉండడాన్ని గమనించి ఆయన తండ్రి రాజు ఫిల్మ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2 లక్షల విలువైన బంగారు అభరణాలను దుండగులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులు సీసీటీవీ కెమెరాలోని దృశ్యాలను పరిశీలించగా ఓ వ్యక్తి వెనుక ద్వారం నుంచి ఇంట్లోకి వెళ్లి రావడాన్ని గమనించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.




# వ్యక్తిత్వ హననం సరికాదు

**కేసీఆర్‌కు సీఎం క్షమాపణలు చెప్పాలి**

**మాజీమంత్రి హరీశ్‌రావు**



హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. దీనికి గాను కేసీఆర్ కు సీఎం క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని మండిపడ్డారు. కేసీఆర్ పదేళ్లు రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా చేసి దేశానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న జానారెడ్డిని కేసీఆర్ గౌరవించారని గుర్తు చేశారు.కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను శనివారం శాసనసభలో రేవంత్‌రెడ్డి మార్చారని ఆరోపించారు. ఏకపక్షంగా ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ ఉచితమని కాంగ్రెస్ నేతలు అన్నారు. అధికారంలోకి వచ్చాక డబ్బులు వసూలు చేస్తున్నారు అని హరీశ్‌రావు విమర్శించారు.